నిరంకుశ పాలనకు చరమ గీతం పాడండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ
- విజయవంతమైన బహిరంగ సభ

విశాలాంధ్ర-చోడవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనకు చరమ గీతం పాడాలని అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా చోడవరం నూకాంబికా కళ్యాణ మండపంలో ఆదివారం ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో, జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభలో జిల్లా కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్రంలో బి.జె.పి నిరంకుశ తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, కర్మాగారాలను ప్రైవేట్ పరం చేస్తూ, కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తూ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని తెలిపారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేఖ విధానాలను అమలు చేస్తూ నిరంకుత్వ పాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. నిరంతరం బడుగు, బలహీన, గిరిజన ప్రాంతాల్లో ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తున్న కమ్యూనిష్టులే నిజమైన దేశ భక్తులు అని తెలిపారు. ఈ నేపథ్యంలో చట్టసభల్లో కమ్యూనిష్టుల పాత్ర అవసరమని, ప్రజలు గుర్తించి రానున్న ఎన్నికల్లో బి.జె.పి.కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. అదే విధంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజలను నిలువెల్ల మోసం చేస్తున్నారని, కార్మికుల్ని రోడ్డున పడేస్తున్నారన్నారు. ముఠా పారిశుద్ధ్య కార్మికులు కు అన్యాయం జరుగుతోందని తెలిపారు. సి.పి.ఎం. కార్యవర్గ సభ్యులు ప్రభావతి మాట్లాడుతూ మహిళపై దాడులు విపరీతంగా పెరిగిపోతు న్నాయని, మహిళలకు రక్షణ కరువైపో తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లకు నిర్ణీ తమైన జీతాలు చెల్లించలేదని, వెట్టి చాకిరీ ఎక్కువైపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిల్లి లక్ష్మయ్య, సీతా బ్రహ్మ నాయుడు, కన్నబాబు, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కనకమహా లక్ష్మి, విస్సారపు నాగూర్, గుప్తా, కాంతం, దేవి సిరసపల్లి సూరిబాబు, సి.పి.ఎం. మండల కార్యదర్శి సోమిరెడ్డి నాయుడు, వ్య.కా.సం. జిల్లా నాయకులు దాసరి. వెంకన్న, సి.పి.ఐ కార్యకర్తలు, అనుబంధ ప్రజా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో ప్రచార భేరి

విశాఖ: మోడీ హటావో, దేశ్ కీ బచావో నినాదంతో ప్రచార భేరి కార్యక్రమాన్ని కంచర పాలెం ఏరియా తిక్కవానిపాలెం, గంగా నగర్, జోగారావునగర్ తదితర ప్రాంతాలలో ఆదివారం నిర్వహించారు. దీనికి సంబంధించి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్ర శేఖర్, ఉత్తర నియోజకవర్గం సహాయకార్యదర్శి నెయ్యల నాగభుషణ రావు మాట్లాడుతూ ఆర్ ఎస్ ఎస్ చెప్పుచేతలలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల మధ్య కులం పేరుతో, మతం పేరుతో విద్వే షాలు రెచ్చగొడుతోందని అన్నారు. ఈ నెల 26న కూర్మన్నపాలెంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఉభయ కమ్యూనిస్టు పార్టీల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కంచరపాలెం శాఖ కార్యదర్శి వి. నల్లయ్య, ఎం.శ్రీను, ఎ.ఆదినారాయణ, ఎస్.జానకిరావు కె.ధర్మారావు రవికుమార్, కె.లక్ష్మి , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ అరాచకాలకు వంతపాడుతున్న వైసీపీ

పెందుర్తి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతోందని సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు విమర్శిం చారు. వామపక్షాలు సాగిస్తున్న ప్రచార భేరి కార్యక్రమం పెందుర్తి నియోజకవర్గంలోని రత్నగిరి నగర్. శతాబ్ది నగర్. లక్ష్మీ నగర్. గొల్లవిల్లి పాలెం. ఎల్బిసి కాలనీ. ఎన్ఏడి లేఅవుట్. పాపయ్య రాజుపాలెంలో ఉత్సాహంగా సాగింది. సిపిఐ నాయకులు కే.నారాయణ రావు, ఎం.రాము, ఏ.రమణ, మిన్నారావు, సిపిఎం నాయకుడు అప్పలనాయుడు తదితరులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించిన శ్రీనివాసరావు ప్రజలను కలిసి బిజేపీ, వైసీపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోయినా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకపోయినా, స్టీల్ ప్లాంట్ అమ్మేస్తున్నా అదికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు ప్రశ్నించకుండా రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. శిధిలమైన రోడ్లు, వెలగని వీధి దీపాలు, తాగునీటి ఇక్కట్లు గురించి పట్టించుకునేవారే కరువైనారని ఆయన విమర్శించారు.

ప్రచార భేరీని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-యలమంచిలి/రాంబిల్లి : మండలంలో నేవీ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సంద ర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజల సమస్యలను గాలికోదిలేసి, అంబానీ,ఆదానీలకు సేవచేస్తున్నా యన్నారు. ధరలు పెరిగినా, నిర్వాసితులకు, ఉపాది లేకున్నా, ప్యాకేజీలు పూర్తిస్థాయిలో అమలు జరక్కపోయినా పట్టించు కోలేదన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా బిజెపిని మటుకు అధికారంలో ఉన్న వైసీపీ గాని, ప్రతిపక్షంలో ఉన్న టిడిపి గానీ, జనసేన వంటి పార్టీలు విమర్శించకపోవటం మన రాష్ట్రానికి పెద్ద దురదృష్టం అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని కేంద్రంలో ఓడిస్తేనే మన రాష్ట్రానికి, దేశానికి మంచి జరుగుతుందన్నారు. దేశంలో కార్మికులకు,రైతులకు, ఉద్యోగులకు, నష్టం చేస్తున్న విదానాలుపై అందరూ కలిసి రావాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని, ప్రజలుపై భారాలు తిప్పి కొట్టేందుకు జరుగుతున్న ఈ ప్రచారభేరి కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో సి.హెచ్.శివాజీ, చెల్లూరి నూకన్న సమ్మెట్ల, వరహాలరావు, శ్రీను,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ జోన్ 2, ఆరో వార్డు, కొమ్మాదీ లో అక్రమ నిర్మాణాల జోరు!

ప్రభుత్వ భూమిని పట్టించుకునే నాధుడే లేడు

విశాలాంధ్ర-కొమ్మాది: మాజీ మంత్రి కుమార్తె కార్పొరేటర్ గా ఉన్న వార్డు నందు భూ కబ్జా దారులు బరితెగిస్తున్నారు. కార్పొరేటర్ స్థానికంగా లేకపోవడం వలన జీవీఎంసీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారా ? లేదా అన్నది ప్రశ్నార్థకం. కొమ్మదిలో బడ్డీ రూపంలో కబ్జా చేస్తున్నారు. స్థానిక నాయకులు సపోర్టుతో బడ్డీ కాస్త షెడ్ గా మార్చినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయ సిబ్బంది కూడా కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు కొమ్మాది సూర్య పేపర్ సమీపంలో ప్రభుత్వ భూములో జరుగుతున్న నిర్మా ణాలను పరిశీలించి తక్షణమైన చర్యలు చేపట్టాలని భూకబ్జా దారులపై కేసులు నమోదు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-యలమంచిలి : తరచూ కడుపు నొప్పి వస్తుండడంతో తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది.ఈ ఘటనపై ఎస్సై కె.పాపినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి పట్టణం రామచంద్రమ్మ కాలనీకి చెందిన బంగారు నూకరాజు(39)కు తరచుగా కడుపు నొప్పి వేధించేది. ఈ నేపథ్యంలోనే ఆదివారం కూడా కడుపు నొప్పి రావడంతో భరించలేక సమీపంలో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపినాయుడు తెలియజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, ఈనెల25 మంగళవారం కొత్త ఎలక్ట్రికల్ విద్యుత్ లైన్లు పనులు మంగళవారం నిర్వహించ బడుతుందని అందువల్ల అనందపురం మండలంలో పెద్దిపాలెం, బీపీ కల్లాలు ,చందక, గొట్టిపల్లి, కుసులవాడ, ఈ పంచాయతీ లకు,అన్ని గృహ వాణిజ్య పారిశ్రామిక వినియోగదారులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ప్రజలందరూ సహకరించవల సిందిగా ఆనందపురం ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

ఏయూతో కూర్మ ఐటి సొల్యూషన్స్ ఎంఓయూ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కూర్మ ఐటి సొల్యూషన్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కూర్మ ఐటి సొల్యూషన్స్ సిఈఓ పి.అప్పల నాయుడులు సంతకాలు చేసారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఆచార్య ఎన్.బాల ప్రసాద్, పి.అచ్యుత సత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు. అవగాహన ఒప్పందంలో భాగంగా పర్యావరణ సంబంధంగా ఏయూ నిర్వహించే పలు పరిశోధన ప్రాజెక్టుల్లో అవసరమైన సాంకేతిక సహకారం కూర్మ ఐటి సొల్యూషన్స్ అందిస్తుంది.

దేశపాత్రునిపాలెంలో యధేచ్ఛగా అక్రమ లే అవుట్లు

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

విశాలాంధ్ర-పరవాడ; జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రుని పాలెంలో అనధికార లే అవుట్లు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేసి విక్రయాలు జరుపుతున్నారు. నియంత్రించాల్సిన సంబంధిత శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక పోలమాంబ గుడి వెనక తెలికల చెరువు పక్కనే ఇటీవల ఎలాంటి అనుమతులు లేకుండా ఓ అక్రమ లే అవుట్ వెలిసింది. అటు రెవెన్యూ, ఇటు జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే స్థిరాస్తి వ్యాపారులు లే అవుట్ వేశారు. దర్జాగా ప్లాట్‌లు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా స్థిరాస్తిని లే అవుట్‌గా మార్చాలంటే అనుమతులు పొందాల్సి ఉంటుంది. అదే విధంగా పన్నులు సైతం చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్థి వ్యాపారులు లే అవుట్ వేసారు. లేఅవుట్ అనుమతి పొందాలంటే 10శాతం రిజర్వుస్థలాన్ని పురపాలక సంఘానికి అప్పగించాలి. 30 అడుగుల రహదారులు ఏర్పాటు చేయాలి. అనంతరం దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలి. కానీ ఇవేమీ లేకుండా ధర్జాగా లే అవుట్ వేసారు. దేశపాత్రునిపాలెంలో మరికొన్ని చోట్లా అనధికార లేవుట్లు వెలిసాయి. పైగా స్థిరాస్థి వ్యాపారులు ఆకర్షణీయ రంగులతో బ్రౌచర్లు ముద్రించి లే అవుట్ లలోని స్థలాలు విక్రయిస్తు న్నారు. ఎటువంటి పన్నులు చెల్లించక పోవడంతో పురపాలక సంఘానికి తీవ్రనష్టం వాటిల్లుతుంది. అలాగే లే అవుట్లలో కొనుగోలు చేసిన స్థలాల్లో ఇల్లు కట్టుకోవాలంటే సామాన్యులకు కష్టతరమవు తుంది. ప్రస్తుతం భవన నిర్మాణానికి ప్లాన్ పొందాలంటే ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలి. లే అవుట్ నెంబర్‌తో సహా నమోదు చేస్తేనే ప్లాన్ పొందేందుకు అవకాశం ఉంటుంది. నాన్ లే అవుట్‌లో ప్లాన్ పొందాలంటే కొనుగోలుదారులు భారీ మొత్తంలో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ విషయం తెలియక కొనుగోలుదారులు అడ్డంగా మోసపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ లే అవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటారా లేదా అనేది చూడాలి.

దేశపాత్రునిపాలెం పోలమాంబ గుడి వెనుక అనదికార లే అవుట్

చేతులెత్తేసిన అధికారులు...!

- స్వామీజీల ఆగ్రహం - వాహనచోదకుల పాట్లు వర్ణణాతీతం
- అప్పన్న నిజరూపాన్ని చూడాలని వచ్చాం... చుక్కలు చూపారు
- చందనోత్సవ ఏర్పాట్లపై భక్తుల అసహనం

మంత్రి కొట్టు సత్యనారాయణను నిలదీస్తున్న భక్తులు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీవరహాలక్ష్మీనృసింహ స్వామివారి చందనోత్సవంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. సింహాచలేశుని దర్శనానికి వచ్చిన స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మా నందేంద్ర సరస్వతీ స్వాములకు, భక్తులకు, వాహన చోదకులకు చేదు అనుభవం ఎదురైంది. సింహగిరి ఘాట్ రోడ్డు నుండి ఆలయంలోకి వెళ్లేంత వరకు అష్టకష్టాలు పడ్డారు. ట్రాఫిక్ జామ్ తో ఘాటిరోడ్లో ఇరుక్కుపోయిన స్వామిజీలు గంటన్నర తరువాత ఆలయానికి చేరుకున్నారు. ఆలయమంత భక్తులతో స్తంభించిపోవడంతో దర్శనానికి ఇబ్బంది పడ్డారు. ఒక సమయంలో స్వామిజీలు అసహనానికి గురయ్యారు. ఎలాగోల అందరినీ దాటుకుని బయటపడ్డ స్వామీజీ విలేఖరులతో మాట్లాడుతూ ఏర్పాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణకు వ్యతిరేకంగా భక్తులు నినాదాలు చేశారు. సామాన్యులకు త్వరగా దర్శనాలు కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఏర్పాట్లు లోపభూయిష్టంగా ఉన్నాయని రూ.1500 టికెట్లు కొనుగోలు చేసినా క్యూలైన్లు కదల్లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు సింహగిరికి తరలివచ్చారు. దేవాదాయ శాఖ అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు దర్శనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సామాన్య భక్తులను పట్టించుకోకుండా ప్రముఖులకు దర్శనం కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్ వద్దకు వెళ్లినమంత్రి కొట్టు సత్యనారాయణను భక్తులు నిలదీశారు. తాగునీరు సహా కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల ఇబ్బందులపై దేవాదాయశాఖ అధికారులతో మంత్రి బొత్స మాట్లాడారు. దర్శనం ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించిన ఆయన క్యూలైన్లలో భక్తులను వేగంగా పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిదంగా టిడిపి పార్టీ జిల్లా ప్రదన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ మాట్లాడుతూ అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉచిత క్యూలైన్ ఘాట్ రోడ్ వరకు , రూ.300/- క్యూలైన్ కొండపై బస్సు స్టాండ్ అంతా, రూ.1,000/- క్యూలైన్ క్యూలైన్ కొండపై బస్సు స్టాండ్ రెండు వరుసలు, రూ.1,500/- వివిఐపి , విఐపి క్యూలైన్ కొండపై నిత్యాన్నదానం బిల్డింగ్ కు వెళ్ళే మార్గం వైపు గంటలు, గంటలు వేచి స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్న భక్తులు ఆవేదనతో మనోవేదన చెందారు. ప్రతీ క్యూలైన్ లో ప్రతి 10 మీటర్లకు ఓ వాటర్ పాయింట్ ఉంటుందని, ఆశీర్వచనాలు ఉండవని చందనోత్సవ సమన్వయ సమావేశాల్లో అధికారులు ఊక దంపుడు ఉపన్యాసలు ఇచ్చి సమయానికి చుక్క మంచినీరు అందించలేక చుక్కలు చూపించారని భక్తులు, గంటా శ్రీనివాసరావు అన్నారు. వరాహనారసింహ అవతారాల సమ్మేళనంగా అలరారుతున్న సింహాద్రినాథుడి నిజరూపాన్ని కనులారా వీక్షించడం మహద్భాగ్యంగా భక్తులు భావిస్తారు. ఆ దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. స్వామి నిజరూపాన్ని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రస్తుతం సింహాచలంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అయితే భక్తులను నియంత్రించలేక అధికారులు చేతులు ఎత్తేశారు. ప్రధాన ప్రవేశ ద్వారం దగ్గర తోపులాట జరిగింది. 1500 రూపాయల లైన్?లోకి పంపుతుండగా తొక్కిసలాట జరిగింది. క్యూలైన్లలో చిన్నారులు, వృద్ధులు నలిగిపోయారు. ఈ విషయంపై ట్రస్ట్ సభ్యులు ముందుగానే అంతరాలయ దర్శనాలు వద్దని ఈఓకు లేఖ అందించాం. లేఖను తుంగలో తొక్కిటం ఒక ఎత్తైతే , మా సలహా, సూచనలు పాటించకపోవటం

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు ప్రముఖ పుణ్యక్షేత్రం అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారినీ దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసా దాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు, బాలింతలకు ఆలయం వద్ద పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేకంగా ఒక గది తయారు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు

వాతావరణ మార్పులతో ప్రభలుతున్న వ్యాధులు

భిన్న వాతావరణంతో మన్య ప్రాంతంలో వ్యాధుల ఉధృతి

విశాలాంధ్ర-జీకే వీధి : వాతావరణ మార్పుల కారణంగా మన్య ప్రాంతంలో వ్యాధులు ప్రబలు తున్నాయి. గతానికి భిన్నంగా వేసవికాలంలో మన్య ప్రాంతంలోనూ ఎండలు మండుతు న్నాయి. నిత్యం శీతల వాతావరణానికి పేరెన్నిక గన్న మన్య ప్రాంతం నేడు వేసవి తాపంతో అల్లాడుతుంది. ఈ క్రమంలో అకాల వర్షాలు, అప్పుడప్పుడు కురుస్తున్న మంచు కారణంగా మన్య ప్రాంతంలో అంతు బట్టని వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో మన్య ప్రాంతంలో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గతంలో కరోనా వైరస్ ప్రపంచ దేశాలను సైతం కకావికలం చేస్తే, ప్రస్తుతం ఫ్లూ జ్వరాలు మన్య ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ఫ్లూ తో పాటు, సాధారణ వ్యాధులు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులతో చింతపల్లి ఆసుపత్రి ప్రతిరోజు కిటకిటలాడుతుంది.

ఖనిజ సంపద కోసమే ఆదివాసులపై దాడులు

పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్

విశాలాంధ్ర-విశాఖ: చత్తీస్‌ఘఢ్ ఆదివాసీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను మల్టీ నేషనల్ కంపెనీ లకు కట్టబెట్టడానికి ఆదివాసులపై భీకర దాడి జరుగుతోందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ విమర్శించారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం పౌరహక్కుల నేత సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. ఈ సభకి పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాడులను ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలన్నారు. ఆదివాసులపై జరిగిన డ్రోన్ల దాడిని, పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ రిపోర్ట్ ని ఆయన వివరించారు. ఏయూ అంత్రోపాలజీ ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ ప్రధాన వక్తగా మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న దాడిని, వారి హక్కుల్ని రాజ్యం అణచివేస్తున్న విధానాన్ని వివరించారు. పీఓడబ్ల్యు అధ్యక్షురాలు ఎం.లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వాలు ఆదివాసీలకి ఎలాంటి అండదండలు కల్పించడం లేదని, అందుకు వాకపల్లి కేసు ఉదాహరణ అన్నారు. వాకపల్లిలో ఆదివాసీ మహిళలపై జరిగిన అత్యాచారాన్ని 16 ఏళ్ల తరువాత గుర్తిస్తూనే, నేరస్తులు ఎవరో నిరూపించలేమని చేతులు దులుపు కున్నారని విమర్శించారు. పోరాడితే తప్ప న్యాయం జరగదని, నేరస్తులు పట్టుబడకుండా తప్పించుకోవడానికి వ్యవస్థలోని అన్ని యంత్రాంగాలు అండగా ఉన్నాయని అన్నారు. పలువురు వక్తలు దివంగతులైన ప్రొఫెసర్ సుబ్బారావుకి నివాళులర్పిస్తూ ఆయన లేకపోవడం పౌర హక్కుల ఉద్యమానికి తీరని లోటని సంతాపాన్ని వెలిబుచ్చారు.

పంచాయతీరాజ్ దినోత్సవానికి ఆహ్వానం

విశాలాంధ్ర-అనంతగిరి: అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం మండల స్థాయిలో నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీపీ శెట్టి నీలవేణి ఆదివారం తెలిపారు.ముందుగా పంచాయతీ స్థాయిలో సోమవారం ఉదయం గ్రామసభలు నిర్వహించి మధ్యాహ్నం మండల కేంద్రంలో మండల స్థాయి పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆమె తెలిపారు. మండల స్థాయిలో వివిధ విభాగాల్లో పలు పంచాయతీలకు అవార్డులు దక్కాయని వాటి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు,పత్రిక విలేకరులు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

వచ్చే ఎన్నికల్లో రామరాజ్యం స్థాపించాలి : కౌన్సిలర్ జగదీశ్వరి

విశాలాంధ్ర-నర్సీపట్నం: వచ్చే ఎన్నికల్లో వైసీపిని అత్యధిక మెజారిటీతో గెలిపించి రామరాజ్యం స్థాపించాలి గాని రావణాసుర రాజ్యం కాదని 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి (చిన్ని) అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 26వ వార్డు టిడిపి కౌన్సిలర్ పద్మావతి మాటలు చూస్తే గతంలో నర్సీపట్నంలో అమ్మ భగవాన్ లా వ్యవహరించిన వారి మాటల్లా ఉన్నాయన్నారు. టిడిపి జాతీయ నాయకులలాగా భ్రమ పడుతున్న వారికి ఎమ్మెల్యే గణేష్ ని విమర్శించే స్థాయి లేదన్నారు .నర్సీపట్నం కి 100 అడుగుల రోడ్డు సరికాదని, పాలన బాలేదని కల్లబొల్లి మాటలతో ప్రభుత్వం పై బురద జల్లడం మానుకోవాలన్నారు .40 ఏళ్ల కుటుంబ పాలనలో నర్సీపట్నం కి ఏం అభివృద్ధి చేశారో ప్రజలందరికీ తెలుసునన్నారు .మూడు నెలల నుంచి 25 వ వార్డు కౌన్సిలర్ రాజేష్ కౌన్సిల్ సమావేశాలకి రావట్లేదని, ఇక ప్రజల బాధలు ఏం పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే గణేష్ స్థానికుడు కాదని పదేపదే టిడిపి నాయకులు అంటున్నారని, మీరు ఎక్కడి నుంచి వచ్చారో ప్రజలకు తెలుసన్నారు. ఎక్కడి నుంచి వచ్చామన్నది కాదని ప్రజలకు మేలు చేస్తున్నామా లేదా అన్నదే ముఖ్యమని టిడిపి నాయకులని ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ ,మున్సిపాలిటీ అధ్యక్షుడు ఏకశివ, ముస్లిం కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ చోటి తదితరులు పాల్గొన్నారు.

5వేల మందికి అన్నసమారాధన

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ నగర ద్విచక్ర వాహన సంచార వర్తక సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో గోసాల జంక్షన్ వద్ద సింహాచలంలోని జరుగుతున్న అక్షయ తృతీయ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి చందనోత్సవ ఉత్సవం సందర్భంగా విచ్చేయుచున్న భక్తులకు జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కర రావు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 5000 మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంక్షేమ సేవా సంఘం సభ్యులు బి. గంగాధరం, పి. దామోదరం, పి. గోవిందరాజు, అప్పారావు, ఎస్ కె ప్రసాద్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ఇన్ఫెక్షన్ రోగికి సన్నీ రూ.5 వేలు వితరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: బ్రెయిన్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతున్న తొమ్మిదేళ్ల బాలుడు సారిక కృష్ణకుమార్ కి మోర్ప చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి పిఏ మోర్పా సన్యాసి రావు ఆర్థిక సహాయం అందజేశారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం పరిదిలో 27వార్డ్ ఏరియాలో దొండపర్తి, కుమ్మరి వీధి కి చెందిన సారిక కృష్ణ కుమార్ బ్రెయిన్ ఇన్ఫెక్షన్ తో నగరం లోని లోటస్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం సోషల్ మీడియా తెలుసుకున్న మోర్పా చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోర్పా సన్యాసిరావు రూ.5వేలు మందుల ఖర్చుల నిమిత్తం కృష్ణ కుమార్ తల్లిదండ్రులు సారిక వెంకట అప్పలనాయుడు, రమాదేవి లకు అందజేశారు. ఆదివారం రోజున సన్యాసి రావు పుట్టినరోజు సందర్భంగా తండ్రి సమానులైన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దీవెనలు తీసుకున్న వెంటనే లోటస్ హాస్పిటల్ కి వెళ్లి బాలుని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని సంబందించిన డాక్టర్స్ మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని మనవి చేయడమే కాక తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మోర్ప సన్యాసిరావు మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం మోర్ప చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం కృష్ణకుమార్ వైద్యం నిమిత్తం తన వంతు సహాయ సహకారం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో సన్యాసిరావుతో పాటు భార్య అనూష రాణి, వైస్సార్సీపీ నాయకులు 27వార్డ్ ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వర రెడ్డి, అజయ్ రెడ్డి, మాదాబత్తుల రమేష్, సారిపిల్లి సంతోష్, కమలాకర్ రెడ్డి, గోవింద్, మధు, అనిల్, శివ, రోగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధరిత్రీ దినోత్సవ పోటీల నిర్వహణలో సెయింట్ ఆన్స్ ప్రోగ్రాం అధికారులకు ప్రశంస

విశాలాంధ్ర-మల్కాపురం :: ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వికాస తరంగిణి అనే స్వచ్ఛంద సంస్థ జాతీయ సేవా పథకం వాలంటీర్లకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో వివిధ కళాశాల నుండి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరికీ పోటీలను నిర్వహించడంలో సీనియర్ ప్రోగ్రాం అధికారులు కీలక పాత్ర వహించారు. ముఖ్యంగా సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి పోటీలను నిర్వహణలోనూ, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై. అనసూయాదేవి న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం లోనూ చురుకైన పాత్ర వహించారు. వీరిని వికాస తరంగిణి తరపున పూజ్య శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి జ్ఞాపిక, సర్టిఫికేట్ అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమ సమన్వయ కర్త గా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్.కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. హరినాథ్ వ్యవహరించారు. సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన వాలంటీర్లు జ్యోత్స్న, తనుషా లకు కూడా ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ పోటీలు పిచ్చుకల సంరక్షణపై, దేవాలయాల్లో పాలిథిన్ కవర్ల నిషేదం పై, వాతావరణ మార్పులపై , సేంద్రియ వ్యవసాయ పై జరిగాయి. వక్తృత్వ పోటీలలో విద్యార్థులు అద్భుతంగా ప్రసంగించారు.విజేతలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామీజీ, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద్ రెడ్డి, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ .వి. లక్ష్మీనారాయణ బహుమతులను అందజేశారు.

రద్దు చేసిన పథకాలపై నోరు విప్పండి

ఎస్సీ, ఎస్టీ మంత్రులకు విదసం రాష్ట్ర సమితి బహిరంగ లేఖ

విశాలాంధ్ర-విశాఖ: ఎస్సీ, ఎస్టీ కోటాలో ఎన్నికై పదవుల అనుభవిస్తున్న మంత్రులు ముఖ్యమంత్రి జరిపే సమీక్ష సమావేశంలోనైనా నోరు విప్పి రద్దు చేసిన సంక్షేమ పథకాల పునరుద్ధరణకు కృషి చేయాలని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు బహిరంగ లేఖ ద్వారా డిమాండు చేశారు. విదసం ఐక్యవేదిక రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విశాఖ అంబేద్కర్ విగ్రహం వద్ద మీడియా సమక్షంలో లేఖ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు పునరుద్ధరణ కు గత మూడేళ్లుగా విదసం ఐక్యవేదికతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత సంఘాలు, దళిత శ్రేణులు పట్టు విడవకుండా విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో రేపు ముఖ్యమంత్రి క్యాంపు ఆఫీస్ లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై సమీక్ష జరుగుతుందని తెలిసిందని, ఆ వేదికపై మంత్రులు కనీస బాధ్యతగా ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తేవాలని డిమాండ్ చేశారు. బేషరతుగా రద్దు చేసిన 20 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, నవరత్నాలలో ఎస్సీ లబ్దిదారులకు అవసరమైన నిధులు 8 వేల కోట్లు సబ్ ప్లాన్ నిధులు నుంచి కాకుండా జనరల్ ఫండ్ నుండి కేటాయించాలన్నారు. సబ్ ప్లాన్ నిధులను కార్పొరేషన్ కి బదలాయించి గతంలో అమలులో ఉన్న 20 సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. జగనన్న నవరత్నాలలో ఎస్సీలకు ఒక్క రత్నం కూడా లేదన్నారు. ఎస్సీ, ఎస్టీల కోసం దళితబంధు వంటి కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టాలని కోరారు. విదేశీ విద్యా పథకంలో షరతులను సడలించాలన్నారు. అల్లూరి జిల్లాలో తలపెట్టిన పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టును నిలిపి వేయాలని కోరారు. సుప్రీంకోర్టు కొట్టి వేసిన జీఓ 3 ని ట్రైబల్ చట్ట సవరణ ద్వారా పునరుద్ధరించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, కోల హరిబాబు, కస్తూరి వెంకట రావు, ఎస్ నూక రాజు, ఏ ఎస్ కే రాజేంద్ర ప్రసాద్, పి వెంకట నాంచారయ్య, చాపల కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

ప్రారంభమైన చింతలవీధి మోదమ్మ ఉత్సవాలు

– ఉత్సవ విగ్రహాన్ని శిరస్సుపై ఎత్తుకొని భారీ ఉరగింపుతో పాల్గొన్న గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర-పాడేరు :గిరిజనుల ఆరాధ్య దైవం గిరిజనుల ఇలావేల్పు కోరిన మొక్కులు తీర్చే మోదకల్పవల్లి పాడేరు మండలం చింతలవీధిలో కొలువైన్న శ్రీ మోదకొండమ్మ మహోత్సవాలు ఆదివారం నుండి ఘనంగా ప్రారంభమైంది. మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సొంత గ్రామమైన చింతల వీధిలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగ మహెూత్సవాలు ఉదయం ఐదు గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఉత్సవాల్లో పాల్గొన్న గిడ్డి ఈశ్వరి అమ్మవారి గుడి నుండి ఉత్సవ విగ్రహాన్ని శిరస్సుపై ఎత్తుకొని భారీ ఉరగింపుతో అమ్మవారిని శతకం పట్టు వద్ద కొలువు తీర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్య క్రమాల్లో ఈశ్వరి పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా పండుగ చేసేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. అమ్మవారు ఆశీస్సులు గిరిజన ప్రజలపైన ఉండాలని గిరిజన ఇలవేల్పుగా కొలు చుకునే మోదకొండమ్మ ఆశీస్సులతోనే గిరిజనులు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరుకున్నట్లుగా ఆమె తెలిపారు. ఈ మూడు రోజులు నిర్వహించే ఈ ఉత్సవాల్లో యావదమంది ప్రజలు వచ్చి ఉత్సవాలు తిలకించాలని ఆమె కోరారు.

బూటకపు మాటలు ఆపి హామీలు నెరవేర్చండి : బుద్ద నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లా మంత్రి బూడి ముత్యాల నాయుడు దేవరాపల్లి కి ఎక్కువ అనకాపల్లి జిల్లాకి తక్కువ మాడుగుల నియోజవర్గానికే మంత్రిగా వ్యవహరిస్తూ జిల్లాని పట్టించుకోలేని అసమర్ధ మంత్రిగా ఇప్పటికే ఖ్యాతి గడించిన మీరు చంద్రబాబుని,లోకేష్, ను విమర్శించే స్థాయి లేదని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు ముత్యాల నాయుడు పై విరిచికుపడ్డారు. ఎన్నికలకు ముందు మీ ముఖ్యమంత్రి సి పి ఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రభుత్వంలో ఉన్న 2 లక్షల 30 వేలు ఉద్యోగాలు భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, ప్రత్యేక హెూదా మెడలో మంచి తీసుకొస్తామని, విశాఖ రైల్వే జోన్ పరుగులు పెట్టిస్తామని చెప్పిన హామీలు నెరవేర్చరా? పోలవరం ఎడమ కాలువ, బాబు జగ్జీవన్ రామ్ సృజల స్రవంతి, సాగునీరు, త్రాగునీరు మెరుగు పరుస్తామని, జిల్లాలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను ఆధునికరించి రైతులు ఉద్యోగులు కార్మికులు జీవితాల్లో వెలుగులు తీసుకువస్తామని బూటక ప్రకటనలు చేసి నాలుగు సంవత్సరాలగా హామీలు గాలికి వదిలేసి తుమ్మ పాల వివి రమణ షుగర్ ఫ్యాక్టరీని అమ్మి వేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న జిల్లా మంత్రిగా జిల్లా హక్కులను కాపాడలేని అసమర్థ నిస్సహాయి మంత్రిగా మిగులు పోయావు తప్ప ఒక పని చేసే ధైర్యం లేదని, ఇప్పటికే వైసిపి ప్రభుత్వం పై ప్రజా వ్యతిరేక స్పష్టంగా కనబడుతుందని, చంద్రబాబు లోకేష్ సభలకు స్వచ్ఛందంగా వేల సంఖ్యలో రోడ్ షోలకు సభలకు వస్తున్నారని గంటలు తరబడి అర్ధరాత్రి సమయం వరకు ప్రజలు వేచి చూస్తున్నారని మీ ముఖ్యమంత్రి సభలకు అధికారి యంత్రాంగం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి మాట్లాడుతుండగా తీసుకువచ్చిన జనం పరుగులు పెడుతున్నారని, ఆసరా సమావేశంలో ధర్మాన్ని ప్రసాదరావు వాలంటీర్లు ఉద్దేశించి మాట్లాడుతూ పథకాలు తీసుకున్నవారి దేవుని మీద ప్రమాణం చేయమని చెప్పడం ద్వారా మీ ప్రభుత్వంలో మంత్రులు ఎంత వనికి పోతున్నారో అర్థమవుతుందని, వచ్చే ఎన్నికల్లో మీకు బంగపాటు తప్పదని, వివేక హత్య కేసు, కోడి కత్తి కేసు జగన్ రెడ్డికి మెడకు చుట్టుకున్న పరిస్థితుల నుండి ప్రజలను డైవర్ట్ చేయడానికి విశాఖ నుండి కాపురం మని చెప్పడం అందులో భాగమని వచ్చే ఎన్నికల్లో మాడుగుల లో మీకు బంగపాటు తప్పదని ముందు దాని గురించి ఆలోచించుకోవాలిని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసి లక్షల కోట్లు అప్పులు తెచ్చి ప్రజలపై పన్నులు భారం వేస్తూ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని నాగ జగదీష్ మండిపడ్డారు. మీ మేనిఫెస్టో విశాఖ జిల్లాకు ఇచ్చిన హామీలపై వాటిని నెరవేర్చే దమ్ము, ధైర్యము ఉంటే జిల్లా సమస్యలు పరిష్కరించి అప్పుడు చంద్రబాబు లోకేష్ గురించి మాట్లాడితే బాగుంటుందని, అనకాపల్లి జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో అస్తవ్యస్తగా ఉన్న రోడ్లను వేయలేని దుస్థితిలో జిల్లా మంత్రిగా ఉన్నారని నాగ జగదీష్ మండిపడ్డారు.

చలో చింతూరు గోడపత్రిక ను ఆవిష్కరించిన సిపిఐ, సిపిఎం జిల్లా, మండల నాయకత్వం

విశాలాంధ్ర-ఎటపాక : మండలం లోని గన్నవరం గ్రామంలో సిపిఐ, సిపిఎం పార్టీల జిల్లా, మండల నాయకులు చింతూరు బహిరంగ సభ గోడ పత్రిక లు ఆవిష్కరించారు. మే-4వ తేదీన మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, బహిరంగ సభ జరుపుతున్నామని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ కందుకూరి స్వర్ణ సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బొప్పెన కిరణ్ తెలిపారు. చింతూరు,వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల పరిధిలోని గ్రామాల నుండి మే 4న పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు. రెండు కమ్యూనిస్ట్ పార్టీల మండలాల నాయకత్వం, కార్యకర్తలు గ్రామ గ్రామాన వాల్ పోస్టర్లు, కరపత్రాలు, గ్రూప్ సమావేశాలు నిర్వహించి ప్రచారం చేస్తున్నారని వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మర్లపాటి నాగేశ్వరరావు గారు, సిపిఐ ఎంపీటీసీ కంటెరాజు, సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ.వి, సిపిఐ జిల్లా నాయకులు వాసంరాము, సిపిఎం ఎటపాక మండల నాయకులు ఆకిశెట్టిరాము, సోందె రామారావు, సిపిఐ నాయకులు వల్లభనేని సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బిజెపి చేనేత విభాగం అధ్యక్షునిగా తెడ్లపు అప్పారావు నియామకం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ జిల్లా బిజెపి చేనేత విభాగం అధ్యక్షునిగా ఆరిలోవ ప్రాంతానికి చెందిన తెడ్లపు అప్పారావు నియమితుల య్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు రవీంద్ర మేడపాటి విశాఖ తూర్పు కో-ఆర్డినేటర్ మురళీమోహన్ రాజు,దక్షిణ నియోజకవర్గ పార్టీ కన్వీనర్, కుల బాంధవులు కొప్పల రామ్‌కుమార్ లు నియామక ఉత్తర్వులు అందచేశారు.వీరితో పాటు జాతీయ చేనేత ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ గుంపున వెంకటేశ్వరరావు జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం యువజన విభాగం అధ్యక్షులు ఎంవి సత్యనారాయణ పలువురు కుల బాంధవ్యులు బిజెపి కార్యకర్తలు హాజరై తెడ్లపు అప్పారావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి చేనేత వృత్తిదారులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా ముగిసిన విజ్జిస్(ఎం.పి .ఎల్) ప్రీమియర్ లీగ్

– ఎంపిఎల్ టైటిల్ విజేత చంద్రంపాలెం ఎస్ఎన్‌డి టైగర్స్

– రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్న బివిపి బుల్స్

విశాలాంధ్ర-కొమ్మాది : ఎంతో ప్రతిష్టాత్మకంగా మధురవాడ యువత మరియు బైపిల్లి ప్రసాద్ పర్యవేక్షణలో ఏప్రిల్ 15నుంచి 23వరకు జరిగిన విజ్జిస్ మధురవాడ ప్రీమియర్ లీగ్ ఎం.పి.ఎల్.ఘనంగా ముగిసింది. ఆదివారం సాయంత్రం మధురవాడ క్రికెట్ స్టేడియం (బి.మైదానంలో) విజేతలకు ట్రోఫీ మెమొంటాలను ప్రధానోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. 8ప్రధాన జట్లు పోటీ పడిన.. క్రికెట్ మ్యాచ్ లలో ఎం.పి.ఎల్.టైటిల్ విజేత చంద్రంపాలెం ఎస్.ఎన్.డి. టైగర్స్ టైటిల్ ను కైవసం చేసుకుంది. రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్న బి.వి.పి.బుల్స్. మూడవ స్థానాన్ని కొమ్మాది లయన్స్,నాలుగవ స్థానాన్ని మధురవాడ రాక్ స్టార్స్ కైవసం చేసుకున్నాయి.బెస్ట్ బ్యాట్స్ మాన్ వాండ్రాసి భాస్కర్(బికెపి రాయల్ స్ట్రైకర్స్),బెస్ట్ బౌలర్ సంతోష్ కుమార్(బివిపి బుల్స్),బెస్టఆల్రౌండర్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్..గణేష్(కొమ్మాది లయన్స్)గా నిలిచారు.ఈ సందర్భంగా..క్రికెట్ చరిత్రను తిరగరాసిన క్రీడాకారుడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండుల్కర్ 50వ జన్మదిన సందర్భంగా 50 కేజీల కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ముఖ్య అతిథిగా హాజరైన...హనీ గ్రూప్ ఓబులరెడ్డి,నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత, సత్యనారాయణ, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్-లీడర్ కంపాహనోక్,జీవీఎంసీ 7వ వార్డ్ కార్పొరేటర్ పిల్ల మంగమ్మ, వెంకట్రావు, మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నక్కా శ్రీధర్, మారుతి బాక్సింగ్ క్లబ్ వ్యవస్థాప కులు వంకాయల మారుతి ప్రసాద్,జగ్గుపిల్లి అప్పలరాజు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, ఉమెన్& చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ మంతెన మాధవి వర్మ, ఎం.డి.అహమ్మద్,పోతిన ఎల్లాజీ,పోతినశివ, సంయుక్తంగా.. విజేతలకు టైటిల్ జట్టుకు ఒక లక్ష రూపాయలు,ట్రోఫీ.రన్నర్ 50,000ట్రోఫీ.ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ..50 ఓవర్ల మ్యాచ్లను మర్చిపోయే తరుణంలో 20-20 మ్యాచ్లకు ఆదరణ పెరుగుతున్న ఈ రోజుల్లో ఐపీఎల్ కు దీటుగా విజ్జిస్ ఎం.పి.ఎల్. విజయం ఆనందాన్నిచ్చిందని, క్రీడల వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరివర్తన వస్తుందని,రాష్ట్రస్థాయి జాతీయస్థాయి గుర్తింపుతో పాటు మంచి భవిష్యత్తు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలన్నారు.విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలన్నారు.క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు,మానసిక ఉల్లాసం వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కె.వి.ఆర్ ఈవెంట్స్ గురునాథ్,కనకదుర్గ ఈవెంట్స్ కొర్రాయిసురేష్, నాగోతి వెంకట సత్యనారాయణ(జపాన్), పోతిన సోంపాత్రుడు,పోతిన చిన్ని, జగ్గుపిల్లినరేష్, పొట్టి ప్రసాద్,పోతిన హనుమంతు టిడిపి,సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు

– మొండిగోడలతో మధ్యలో నిలిచిన తహశీల్దారు కార్యాలయం

–ఏడేళ్లయినా కొత్త భవనాలకు నిరీక్షణే

విశాలాంధ్ర-చోడవరం : నియోజకవర్గ కేంద్రం, ఏజెన్సీ ముఖ ద్వారం, జిల్లాలో ఎంతో ప్రతిష్ట కలిగిన చోడవరం లోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పరాయి పంచన కాలం వెళ్లదీస్తున్నాయి. సుమారు 50 లక్షలు ఎం.వి.లాడ్స్ నిధులతో అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్.యువరాజ్ తో 2016 లో స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి నూతన భవనాలు శంఖు స్థాపన చేసినప్పటికి, నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవడంతో స్త్రీ శక్తి ఉపాధి హామీ భవనంలో తహశీల్దారు కార్యాలయం కార్యకలాపాలు సాగిస్తున్నారు. అలాగే డివిజనల్ కార్మిక శాఖ అధికారి కార్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల కార్యాలయం పరాయి పంచనే నడుస్తున్నాయి. న్యాయ స్థానముల సముదాయంలో ఆధునిక భవనాల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో న్యాయవాదులు, కక్షి దారులు యమయాతన అనుభవిస్తున్నారు. అప్పటి టి.డి.పి. ప్రభుత్వ హయాంలో మెదలైన తహశీల్దారు కార్యాలయం నూతన భవనాలు ఏడేళ్ళయినా నిర్మాణంలోనే నిలిచిపోయాయి. నిర్మాణ లోపాలతో కొన్ని చోట్ల శిధిల స్థితి దాపురిస్తోంది. ప్రజలకు ఉపయోగపడే రహదారుల సంగతి పట్టించుకోని నేటి అధికార పార్టీ నేతలు, మంత్రులు ప్రభుత్వ కార్యాలయాల సంగతి చూసేందుకు సమయం సరిపోవడం లేదు. నిత్యం గాజువాక నుండి చోడవరం ప్రయాణం చేసే స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ, కొత్తగా రోడ్లు దుస్థితి పై అధికారులతో సర్వే చేయడం కొంత విడ్డూరంగా వున్నను, రహదారులు బాగుపడితే అంతే చాలని సకల జనుల అభిప్రాయం. కానీ పర్యవేక్షణ కే పరిమితం అయిన ఎమ్మెల్యే కబుర్లు ఊరు దాట లేదని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు. ఏదైనా పరాయి పంచన నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల దిక్కు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

పేరుకే పెద్దాసుపత్రి... రోగుల పాలిట మృత్యుకుహరం!

– స్పందించని వైద్యులు.. మృత్యువాత పడుతున్న రోగులు

– గిరిజన సెల్ ఉన్నా... ప్రయోజనం సున్నా

టీడీపీ నాయకుడు గణపతి

విశాలాంధ్ర-చింతపల్లి : విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రి పేరుకే పెద్ద ఆసుపత్రి తప్ప, అక్కడ వైద్యులు స్పందించరని, తద్వారా రోగులు మృత్యువాత పడుతున్నారని తెదేపా నాయకుడు వంజరి గణపతి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారిందన్నారు. ఆసుపత్రులను అభివృద్ధి పరుస్తున్నామని, వైద్యులను, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైకాపా ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో మ్రోగుతున్న మరణ మృదంగంపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చింతపల్లి ఆసుపత్రికి తీసుకువచ్చిన రోగులను ఇక్కడి వైద్యులు కేవలం ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం పేరిట నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి, అక్కడినుంచి విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించడం మినహా రోగులకు సకాలంలో ఏ ఆసుపత్రిలోనూ సరైన వైద్యం అందించకపోవడం వలన కేజీహెచ్ కు వెళ్లే రోగులు మృత్యువాత పడుతున్నారన్నారు. పెద్దాసుపత్రి లో గిరిజన సెల్ ఏర్పాటు చేసినప్పటికీ మన్య ప్రాంతం నుండి వెళ్లే గిరిజన రోగులకు ఆ సెల్ ఏ విధంగానూ ఉపయోగపడటం లేదని, వైద్య పరీక్షల పేరిట కేజీహెచ్ వైద్యులు, సిబ్బంది రోగుల నెత్తురు పిండుతున్నారని ఆయన ఆరోపించారు. నిరుపేద గిరిజనులు, గిరిజనేతరులు రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువెళ్లలేక ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తే వైద్యం అందించవలసిన వైద్యులు మెరుగైన వైద్యం పేరిట రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. నేటి భారతం సినిమాలో " నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే సినీ గేయాన్ని తలపించే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు ఉందన్నారు. ఇందులో భాగంగానే ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి పరీక్షలు రాసి ఇంటికి వచ్చిన తన అన్న కుమార్తె వంజరి భవాని అస్వస్థతకు గురైతే చింతపల్లి ఆసుపత్రికి తర లించగా అక్కడి నుండి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించడంతో ఆర్థిక స్తోమత లేని ఆమె తల్లిదండ్రులు మైదాన ప్రాంతానికి తీసుకెళ్లేందుకు నిరాకరించడంతో స్థానిక సీఐ, ఎస్ఐ లను పిలిపించి రోగిని తప్పనిసరిగా మైదాన ప్రాంతాలకు తీసుకువెళ్లాలని వైద్యులు ఒత్తిడి చేశారన్నారు. వారి మాట మేరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి అక్కడ నుండి కింగ్ జార్జ్ ఆస్పత్రికి తరలిస్తే ఆ ఆసుపత్రిలో రోగిని పట్టించుకున్న నాదుడే కరువయ్యాడన్నారు. దీంతో తన అన్న కుమార్తె సకాలంలో వైద్యం అందకే తుది శ్వాస విడిచిందని ఆయన ఆరోపించారు. చేతికి ఎందుకు వచ్చిన కుమార్తె మరణంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది. ఆమె స్వగ్రామమైన మామిడిపల్లి లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆగ్రహించిన గిరిజనులు మన్య ప్రాంత ఆసుపత్రులలో నిపుణులైన వైద్యులను నియమించాలని, రోగుల పట్ల వైద్య సిబ్బంది ఉదాసీన వైఖరి ప్రదర్శించి చికిత్సను అందించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

ట్రైకార్ డైరెక్టర్లు గా సుర్ల లోవరాజు, సుమర్ల సత్యవతి నియామకం హర్షణీయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్పర్సన్ హలియా రాణి

విశాలాంధ్ర-చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ డైరెక్టర్లుగా సుర్ల లోవరాజు, సుమర్ల సత్యవతి లు నియమితులు కావడం హర్షణీయమని చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ జల్లి హలియా రాణి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వైకాపా ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన సుర్ల లోవరాజు, సుమర్ల సత్యవతి ల సేవలను గుర్తించి ట్రైకార్ డైరెక్టర్లుగా నియమించడం హర్షణీ యమన్నారు. మన్య ప్రాంతంలో నిరుద్యోగ యువతకు, చిరు వ్యాపారులకు ట్రైకార్ రుణాలు మంజూరు కు వీరిద్దరూ తమ వంతు కృషి చేయాలని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

బాటసారులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం స్వయం భూ శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోందని ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 17 వ రోజు అయిన ఆదివారం నాడు స్థానికులు కేశవరపు బాలాజీ, ముంజి గణేష్, కె.గణేష్, పెయింటర్ బాబు, జయరాం వారి ఆర్థిక ప్రోత్సాహంతో బాట సారులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ జరిగిందన్నారు. మానవ సేవయే మాధవ సేవ అను శుభసంకల్పంతో మొదలైన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వయం భూ శివాలయం ప్రధాన అర్చకులు కొడమంచలి శ్రీనివాస్, బాల గణపతి సంఘం సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు..

అదుపుతప్పిన కారు : ఇద్దరికీ తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- మారేడుమిల్లి : మారేడుమిల్లి: చింతూరు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి కారు అదుపుతప్పి లోయలోకి దూసుకు వెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి ,సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికుల వివరాలు ప్రకారం రాజమండ్రి ప్రాంతానికి చెందిన కొందరు కారులో మారేడుమిల్లి పర్యాటక ప్రాంతానికి వచ్చారు. ఈ నేపథ్యంలో మారేడుమిల్లి చింతూరు ప్రధాన రహదారిపై కారు లో ప్రయాణిస్తుండగా కారు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. చెట్టును ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది .ఈ సంఘటనలో ఎం,సంతోష్ , కె,రూప్ క్ వర్మ కు గాయాలయ్యాయి, 108 లో సిబ్బంది మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

స్వయం భూ శ్రీ విఘ్నేశ్వరుని సన్నిధిలో సామూహిక లక్ష్మి గణపతి హోమం

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్రం లోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన, పురాణ చరిత్ర కలిగిన చోడవరం శ్రీ స్వయం భూ విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆదివారం భక్తులచే సామూహి కంగా లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించి నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడ మంచలి చలపతిరావు తెలియజేశారు. వైశాఖ శుద్ధ చవితి సందర్భంగా పట్టణానికి చెందిన వేద పండితులు శ్రీ ధవళ ప్రసాద్ గారు ఆధ్వర్యంలో స్వామికి హెూమాలు జరిపినట్లు తెలిపారు. పురుష సూక్త విధానంలో వేకువజాము నుండి స్వామికి పంచామృత అభిషేకములు, హరిద్ర, కుంకుమ, విభూది, చందనములు, వివిధ రకముల ఫలోధకములతో ప్రత్యేక అభిషేకములు నిర్వహించారు. వేద పండితులతో గణపతి అథర్వణ శీర్షం పారాయణ జరిపించి, సామూహిక శ్రీ లక్ష్మీ గణపతి హెూమం జరిపినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఓ. ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి, అర్చకులు గుంటూరు శ్రీనివాస రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

26న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-హుకుంపేట : ఈ నెల 26వ తేదిన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని స్థానిక ఎంపీడీవో వెంకటరావు ఒక ప్రకటనతో పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం మందిరంలో నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, దాదాపుగా 28 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అధికారులు మండలంలో వారి పనితీరుపై సమీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే మండలంలో నాయకులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.26వ తేది ఉదయం 10.30 నిమిషాలకు సమావేశం ప్రారంభిస్తామని అందురు విధిగా హాజరు కావాలని కోరారు. మండల స్థాయిలో ఏఅధికారి రాకపోయిన వారిపై జిల్లా కలెక్టర్ కు పిర్యాధు చేస్తామని హెచ్చరించారు.

ముత్యాలమ్మ అమ్మవారి గర్భగుడి హుండీ లెక్కింపు

రూ. 85,600లు వచ్చినట్లు వెల్లడి

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యప్రాంత వాసుల ఆరాధ్య దైవం చింతపల్లి గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి గర్భగుడి హుండీ లెక్కింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ, ఆలయ పూజారులు, ధర్మకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హుండీ లెక్కింపు లో భక్తుల నుంచి 85 వేల ఆరు వందల రూపాయలు వచ్చినట్లు ముత్యాలమ్మ ఉత్సవ కమిటీ, ఆలయ పూజారులు, ధర్మకర్తలైన సుర్ల వంశస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దురియ హేమంత్ కుమార్, పోతురాజు బాలయ్య, ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, కోశాధికారి పసుపులేటి వినాయకరావు, ధర్మకర్తల వంశస్థుడు, ఆలయ పూజారి సుర్ల అప్పారావు, సుర్ల వీరేంద్ర కుమార్, మాదల తిరుపతి రావు, ఉప సర్పంచ్ నూరు బాబు, లక్కోజు నాగభూషణం, తిపిరెడ్డి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కలిసినట్లే... కాని కలవరు

– గడపగడపలో బోడ్డేడ జాడ ఎక్కడ...?

– అధినేత ఆదేశాలను దిక్కరించి చెరోదారి

విశాలాంధ్ర-అనకాపల్లి : యలమంచిలి నియోజకవర్గం మునగపాకలో ఎమ్మెల్యే యూ.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు)కు గవరకార్పోరేషన్‌చెర్మన్ బొడ్డేడ ప్రసాద్ వర్గాల మధ్య గ్రూపు రాజకీయాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధిష్టానం ఎన్ని మార్లు పిలిచి మందలించిన, ఇద్దరి మధ్య రాజీకుదిర్చిన మేము ఇంతే.. నేనింతే అనే రీతిలోనే గ్రూపురాజకీయాలు చేస్తున్నారనే విమర్శఉంది..ముఖ్యంగా బొడ్డేడ ప్రసాద్ వ్యవహారశైలే గ్రూపు రాజకీయాలకు కేంద్రబిందువుగా మారుతుంది. గడిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో సైతం ప్రసాద్ వర్గం ప్రచారం చేసిన జాడ ఎక్కడ కనిపించలేదు.. ఎమ్మెల్యే అనుచరుల మాత్రమే ప్రచారం చేశారు. గడపడపకు కార్యక్రమంలో కూడ ప్రసాద్ వర్గం పాల్గొన సందర్భమేమి లేదు. ఇలా ఎక్కడ చూసిన ఎమ్మెల్యేతో కావాలనే ప్రసాద్ విభేదిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న కన్నబాబు, ప్రసాద్‌ను కలుపుకోవాలని ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలితం లేకుండా పోతుందనే భావన పార్టీ వర్గాలో ఉంది. ప్రెస్‌మీట్‌లు, సమావేశాలో మాత్రం ఎమ్మెల్యేతో కనిపించే ప్రసాద్, పార్టీ ఆదేశించిన కార్యక్రమాలలో ఎమ్మెల్యేతో ప్రసాద్ పాల్గొన జాడ లేదు.. ఇలా ఎక్కడచూసిన ప్రసాద్ వర్గం ఎమ్మెల్యే వర్గంతో దూరంగా ఉండాలనే భావనలో ఉన్నట్లు తెలుస్తుంది. గడిచిన కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా బహిరంగానే ప్రసాద్ మంత్రి అమర్ అండతో మాట్లాడిన సంఘటనలు అందరికి తెలిసిందే.. అమరే వచ్చే ఎన్నికలో యలమించిని నుంచి పోటి చేస్తారని కన్నబాబురాజుకు టికెట్ ఇవ్వరానే ప్రచారం కూడ ప్రసాద్ చేయించినట్లు విమర్శలు ఉన్నాయి. ఇలా ఇద్దరి మధ్య అనేక సందర్బరాల్లో, వ్యక్తిగత విమర్శలు సైతం చోటుచేసుకున్నాయి. అయితే ఇవన్ని గమనించిన అధిష్టానం ఇద్దరిని పిలిపించి సర్ది చెప్పి కలిపి పనిచేసుకోవాలని చెప్పినప్పటికి కలిసినట్లే కలిసి కలవకుండ గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ కార్యకర్తలను అయోమయంలో పడేస్తున్నారని కార్యకర్తలే వాపోతున్నారు.

ప్రసాద్ మితిమీరిన పెత్తనం వెనుక హస్తం ఎవరిది?

గవరకార్పోరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ వ్యవహారశైలి యలమంచిలి నియోజకవర్గం మునగపాకలో పార్టీ మనుగడనే ప్రశ్నార్థకం చేసే పరిస్థితికి తీసుకువచ్చేలా ఉందని పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.2019 ఎన్నికల ముందు వైసిపిని వీడి టిడిపిలోకి వెళ్లిన ప్రసాద్ ఆ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కన్నబాబుపై అనేక ఆరోపణలు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ వైసిపి కండువా కప్పుకున్నాడు.ఇలా పూటకో పార్టీ మారుతూ ఎమ్మెల్యే వర్గానే ఇబ్బంది పెట్టే మితిమీరిన పెత్తనం వెనుక మంత్రి అమర్‌నాధ్ హస్తం ఉన్నట్లు పార్టీ నాయకులు బహిరంగంగా చెప్పుతున్నారు.తనది కాని నియోజకవర్గంలో ఇలాంటి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం పార్టీ మనుగడకు, ఇంతటి అవకాశం అందిపుచ్చుకున్న మంత్రి అమర్‌కు సరికాదని పార్టీ వర్గాలే అంటున్నాయి. ఏదైమైన వారు కలిసినట్లే.. కాని కలవరు...?

గుత్తులపుట్టులో పాత భవనంలోనే గ్రామ సచివాలయం

బిల్లులందక నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణ పనులు

విశాలాంధ్ర-పాడేరు: గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ స్థానిక సంస్థలకు ఆర్థిక భారంగా మారాయి. ఇప్పటికే నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు సచివాలయాలతో మరింత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇదే తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల ఖాతాల నుంచి నిధులను వెనక్కి తీసుకోవడంతో సమస్య మరింత జఠిలమైంది. సచివాలయాల నిర్వహణకు నిధులు వెచ్చించాల్సి రావడం అదనపు భారంగా మారింది. ప్రభుత్వం మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. పంచాయతీ కేంద్రంలో సచివాలయాలకు పక్క భవనాలను నిర్మించి అందులో పరిపాలన వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వం మెరుగైన సత్వర సేవలందించాలని లక్ష్యంగా పెట్టుకొంది. అందుకు సంబంధించి పంచాయతీ కేంద్రాల్లో సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే నిధుల కొరత కారణంగా కొన్నిచోట్ల ఆ పనులు ముందుకు సాగడం లేదు. పాడేరు మండలం గుత్తులపుట్టు పంచాయతీలో నిధుల కొరత కారణంగా సచివాలయ భవన నిర్మాణ పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వం అనుకున్న సమయానికి భవన నిర్మాణ పనులు పూర్తి చేయలేదని ప్రజలు వాపోతున్నారు. పనులు చేసిన వారు బిల్లుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. పంచాయతీ పాత భవనంలోనే సచివాలయం కొనసాగుతోంది. సొంత భవనంలోకి చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు. బిల్లులు రాక సచివాలయ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నిధులు విడుదల చేసి సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.





అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం / పాత భవనంలోనే సచివాలయం

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

బరితెగిస్తున్న ఇసుక అక్రమార్కులు

- విచ్చలవిడిగా పోటాపోటీగా రవాణా
- పట్టని అధికారులు
- కాసులకు కక్కుర్తిపడి కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణలు

విశాలాంధ్ర-హుకుంపేట: మండలంలో ఇసుక అక్రమ రవాణా దారులు బరితెగిస్తు అక్రమంగా విచ్చలవిడిగా ఉదయం రాత్రులో సైతం రవాణా చేసుకుని లాభార్జన చేసుకుంటున్నారు. వీటిని అరికట్టా ల్సిన సంబంధిత శాఖ అధికారులు నామమాత్రంగా చర్యలు చేపడుతు న్నట్టు చూపిస్తూ కాసులకు కక్కుర్తిపడి వారికి లోపల ఉన్నట్లు ఆరోప ణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వా నికి కానీ పంచాయితీ కానీ ఎటువంటి రుసుము చెల్లించ కుండా విచ్చలవి డిగా ఇసుక రవాణా చేసుకుంటు న్నారు. మండలంలోని దిగుడుపు ట్టు ,పై గడుదపల్లి, పెద్ద గరువు,మా రేడు,మంగ భంద,పాము రాయి పెద్ద గేడ్డల్లో నుంచి ఇసుక రవాణా చేస్తు న్నారు. ప్రభుత్వ నిబం ధనలకు విరుద్ధంగా వాల్టా చట్టాన్ని ఉల్లంఘి స్తు పెద్దగరువు,దిగుడుపు ట్టు బ్రిడ్జి ఆనుకొని ఇసుక తవ్వకాలు చేస్తుం డడంతో బ్రిడ్జి పిల్లర్లు ఏర్పడుతున్నాయి. మంగభంద, పై గడుదపల్లి గడ్డలో అయితే దొరికినం త దోచు కోనీ పోటాపోటీగా ఇసుక మెట్లు వేసుకొని రాత్రి పగలు తేడా లేకుం డా తరలించుకుపోతున్నారు. అది కూడా అధిక ధరలకు విక్రయిం ఇసుక అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వారి అక్రమ రవాణాను అడ్డుకుని నిలదీసిన స్థానిక పాత్రికేయులకు బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆయా శాఖల అధికా రుల అండ దండలతోనే ఇసుక మాఫి యా తగ్గేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు స్థానిక పాత్రికేయులు ఫిర్యాదు చేసిన పట్టించుకో వటం లేదు. దీనిపై విచారణ చేపట్టి ఉన్నత ఫిర్యాదు చేస్తే అధికారులు వారికి కుమ్మక్కై సొమ్ము చేసుకుంటు న్నా రు.తక్షణమే సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్పందించి మండ లంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయా లని మండల వాసులు కోరుతున్నారు.

శ్రీ వరాహ నరసింహస్వామి వారి నిజరూప దర్శనానికి తండోపతండాలుగా...

విశాలాంధ్ర-సింహాచలం: సింహాచలం వరహా నరసింహ స్వామి చందనోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో స్వామివారికి టీటీడీ ఆలయ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే ఆలయ ధర్మకర్త అశోక్ గజపతి రాజు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నిజరూప దర్శనం చేసుకున్నవారిలో కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, విశాఖ నగర మేయర్ తదితరులు ఉన్నారు. చందనోత్సవం సందర్భంగా ఆదివారం 2 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ సీర సత్యనారాయణ, చందనోత్సవాల ప్రత్యేక అధికారి ఆజాద్, ఆలయ ఈఓ త్రినాథ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి లో సర్వికల్ క్యాన్సర్ వాక్సిన్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్) కి ప్రత్యేక వాక్సిన్ ఇప్పుడు నగరం లోని లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి లో అందుబాటులో ఉందని ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ లయన్ డాక్టర్ వి. ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు.క్వాడ్రివాలెంట్ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ సెరోటైప్ 6,11, 16 %&% 18 కలిగిన భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ హెచ్ పి వి వ్యాక్సిన్ "సెర్వ వాక్" ను సెరమ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా మొదటిసారిగా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. 9 నుంచి 26 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుషులు స్త్రీలు ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చన్నారు. 9 నుంచి 14 సంవత్సరాల వయసు వారికి 2 మోతాదుల తొలుత, 6 నెలకు, 15 నుంచి 26 సంవత్సరాల వయసు వారికి 3 మోతాదులు తొలుత, 2 %&% 6 నెలలకు వ్యాక్సిన్ డోసులు వేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి డోసు అందరికీ అందుబాటు ధరలోనే రూ.2000/- ఉందన్నారు. నగర వాసులందరూ లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ సర్వికల్ క్యాన్సర్ వాక్సిన్ ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

200మందికి ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-దేవీపట్నం : శ్రీ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం శివారు సిగినలపాడు లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం లో సుమారు 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరం లో డా.భాస్కర్, డా.శ్రీనివాస్ రాయుడు, డా.తలారి వెంకట సుబ్బారావు వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. సెక్రటరీ స్వామీజీ మాట్లాడుతూ ఏజెన్సీ లో రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని,వేసవి కాలం లో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్వామీజీ సూచించారు, ఈ కార్యక్రమం లో శ్రీ రామకృష్ణ మఠం మేనేజర్ స్వామి రఘువీరానందజీ, స్వామి సేవ్యానందజీ, బ్రహ్మచారి వివేక్ పాల్గొన్నారు,అనంతరం వైద్య శిబిరం కు వచ్చిన రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమం లో రామకృష్ణ మిషన్ కో-ఆర్డినేటర్ కానుమాను శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యశాలలో తాండవిస్తున్న అపారిశుద్యం

డంపింగ్ యార్డు లా తలపిస్తున్న పరిసరాలు

విశాలాంధ్ర-దేవీపట్నం: ఎన్నో సంవత్సరాల చరిత్ర కల్గిన ప్రభుత్వ దావాకానా ఇప్పుడు ప్రస్తుతం రోగులకు సేవలు అందించటంలో ప్రాంగణమంతా దుర్గేంధ్యంగా మారి ఆసుపత్రికి వెళ్ళటానికి వెనకాడుతున్న పరిస్థితి దాపురించింది.అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చుట్టు ప్రక్కల నివాస గృహాల వాళ్ళు కొన్ని సంవత్సరాలుగా యదేచ్ఛగా వేస్తున్న చెత్త తో ఆసుపత్రి ప్రాంగణం డంపింగ్ యార్డుల తయారయ్యింది.చెత్త అధిక మొత్తం లో పేరుకు పోవడంతో దుర్వాసన వస్తుందని ఆసుపత్రికి వచ్చే రోగులకు విలవిలాడుతున్నారు. సుస్తీ చేసి ఆసుపత్రికి వచ్చే రోగులకు దుర్వాసన వెదజల్లుతుండటంతో రోగులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రస్తుతం ఇందుకూరుపేట లో కరోనా చాప కింద నీరులా ప్రబలిపోతున్న తరుణంలో సామాన్య రోగులు ఆసుపత్రికి రావటానికి భయందోళన చెందుతున్నారు. కనీసం సానిటేషన్ చెయ్యకపోవడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని ఆసుపత్రికి వచ్చే రోగులు వాపోతున్నారు. పీహెచ్‌సీ తగా చెత్తను అక్కడి నుండి తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ స్థలం కాబట్టి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి స్థలం కబ్జా కు గురి కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ద్వారకా నగర్ వద్ద చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-యల మంచిలి : పట్టణంలో ప్రధాన రహదారి పక్కన ద్వారకా నగర్ శ్రీ కృష్ణుని ఆలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వేసవికాలం పూర్తయ్యే వరకు ప్రతీ రోజూ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తామని,దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ధూళి దేవుళ్ళు, కార్యదర్శి వియ్యపు గోపి, ఉపాధ్యక్షుడు గొల్ల గాని సన్యాసిబాబు, చీర అచ్చిబాబు, కోన శంకర్రావు, రేఖ శ్రీనివాస్,కె.శ్రీను, వి.శ్రీను, వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఒకే వేదిక రావాలి : దాసరి చెన్నకేశవులు

విశాలాంధ్ర బ్యూరో -అనకాపల్లి: రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలు ఒకే వేదికపై వచ్చి ఓట్ల శాతం ఆధారంగా రాజ్యాధికారం వైపు అడుగులు వేసి సాధించుకోవాలని రాష్ట్ర బ్లైండ్ దేశ్ సమస్త వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు పిలుపునిచ్చారు. జిల్లా మనరాజ్యం స్థాపనా వేదిక కమిటీ వారి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ప్రజా చైతన్య సదస్సు కార్యక్రమం స్థానిక పట్టణం వివేకానంద మీటింగ్ హాల్ లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దళిత బహుజన వర్గాల ఓట్ల శాతం ఎంతో అధికారం లో వాటా అంతే కేటాయింపబడాలని ప్రజాస్వామ్యంలో కింది స్థాయి వర్గాల వారు బాబాసాహెబ్ అంబేద్కర్ గారు తమ పోరాటం తో కల్పించిన ఓటు విలువ తెలుసుకుని చైతన్య వంతులై రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు మనరాజ్యం ఉత్తరాంధ్ర నమన్వయ కర్త మల్లారపు లోవచంద్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు నేలపూడి బాబూరావు,స్వామి దళిత వైద్యసంఘం మాలపాటి కామరాజు, మాల చంద్రశేఖర్ పల్లా బాబ్జి వంటి దయ్యాల రాజు, బీసీ సంఘం అధ్యక్షులు నక్కిల్ల నాగమణి వివిధ మహిళా సంఘాల నాయకులు పెట్ల అప్పారావు, కామిశ శంకర్, మోహా రమేష్, బోగాది వరహాలు, పినపల్లి కొండలరావు లు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ గొడ్డేటి మాధవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొయ్యూరు: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి జన్మదిన వేడుకలను మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ఎంపీపీ బడుగు రమేష్ జడ్పీటీసీ వార నూకరాజు చింతపల్లి ఏఎంసీ చైర్పర్సన్ రాజులమ్మ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి ఎంపీటీసీలు సోమాలింగు అప్పారావు కొయ్యూరు సీబ స్వామి నాయుడు కొయ్యూరు మంప ఎస్ఎంల రాజారావు లోకేష్ కుమార్ వైసీపీ (గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ పలువురు ప్రజా ప్రతినిధులు ఎంపీ మాధవికి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ జన్మదినం సందర్భంగా సుమారు 600 మంది పేద మహిళలకు చీరలు వస్త్రాలు పంపిణీ చేశారు. ముస్లిం క్రైస్తవ మత పెద్దలు ఎంపీ మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తండ్రి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేవుడు బాటలో పయనిస్తూ నిరంతరం ప్రజల కోసం కృషి చేస్తున్న ఎంపీ మాధవి మరింత ఉన్నత పదవులను చేపట్టి గిరిజన ప్రాంత అభివృద్ధికి గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పలువురు ప్రజా ప్రతినిధులు నామినేటెడ్ పదవులలో ఉన్నవారు పలువురు అధికారులు ఎంపీ మాధవిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..

రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కై పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలి

యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త సుందరపు

విశాలాంధ్ర-అనకాపల్లి: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని యలమంచిలి నియోజక వర్గ సమన్వయకర్త సుందరపు విజయకుమార్ అన్నారు.మండలం అరబుపాలెం గ్రామంలో జనవాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎలమంచిలి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ సుందరపు విజయ కుమార్ విచ్చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు.వైసీపీ ప్రభుత్వం మద్యం రేట్లును అధికంగా పెంచిందని,అలాగే మద్యం నాణ్యత లోపించిందని ధ్వజమెత్తారు.గతంలో పలు సమస్యలపై అరబుపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యే కన్నబాబును నిలదీసిన సందర్భాన్ని గుర్తు చేశారు. మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న ఈ గ్రామం అభివృద్ధి సున్నమని తెలిపారు.ఒకసారి జనసేన పార్టీకి అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తామని తెలిపారు.జనవాణి కార్యక్రమం ద్వారా మీ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.నాగులపల్లి గ్రామం నుండి విజయ్ కుమార్ సమక్షంలో వీర మహిళ పాప వేణి,వెంకటలక్ష్మి,శంకర్,బాబు,యం.రుక్మణి వీర మహిళ సరోజినీ అధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు,మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాము,ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, కోశాధికారి ఎల్లపు సంతోష్, వీర మహిళ శ్యామల,కోయిలాడ చైతన్య,కోయిలాడ గంగాధర్,మండల జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఎండతీవ్రతతో అల్లాడుతున్న జనం

పాడేరులో గొడుగులు వేసుకుని కూరగాయలు విక్రయిస్తున్న గిరిజనులు

విశాలాంధ్ర-పాడేరు : మన్యం ప్రాంతంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. ఈ ఏడాది మన్యంలోనూ ఎండలు తీవ్రంగానే ఉన్నాయి. మైదాన ప్రాంతానికి పోటీగానే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఆదివారం సైతం ఎండ ప్రతాపం చూపింది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలయ్యింది. నాలుగు గంటల వరకు వేడి ప్రభావం కొనసాగింది. మధ్యాహ్నం వేళలో ఎండ తీవ్రతకు బయటకు రావడానికి జనం భయపడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో గొడుగులు వేసుకుని బయటకు వెళుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో ఏజెన్సీ వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఊహించని రీతిలో ఎండల తీవ్రత ఉండటంతో ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. సాయంత్రం 6 గంటలైనా వేడిగాలి వెంటాడు తూనే ఉంది. పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. గర్భిణులు, బాలింతలు ఎండల వేడిమికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. విధి లేని పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తప్పనిసరి, లేదంటే వడదెబ్బ మహమ్మారి బారిన పడే ప్రమాదం లేకపోలేదు. రక్షిత మంచినీరే కాదు తరచూ మజ్జిగ ఒఆర్ఎస్ ఎటువంటి క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్యులు చెబుతున్నారు.

అల్లు రమేష్ మరణం కళాకారులకు తీరని లోటు

- అల్లు సంతాప సభలో వక్తలు

విశాలాంధ్ర-విశాఖ సిటీ: రంగస్థల, టీవీ, సినీ నటుడు అల్లు రమేష్ మరణించడం దుర దృష్టకరమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. బాలయ్య శాస్త్రి లే అవుట్ సింధూర ఫంక్షన్ హాల్లో ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, రంగసాయి నాటక సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన అల్లు రమేష్ సంతాప సభలో దాడి సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నాటక దర్శకుడు చలసాని కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అల్లు రమేష్ తో వారికున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళా రంగ ప్రముఖులు వై. అప్పారావు, బాదంగీర్ సాయి, యాదకుమార్, ఏ.ఎం.ప్రసాద్, బి. ధనేశ్వరావు, వి. నాంచారయ్య, ఏ. సురేష్, సూర్యకుక, చెన్నా తిరుమలరావు, బి. నర్సా, రవి తేజ, వంకాయల మారుతీ ప్రసాద్, బ్రహ్మాజీ, ఫుల్లేశ్ బి. జగత్ రావు, కళ్యాణ్, జమ్మా చిన్నబాబు, తదితరులు పాల్గొని అల్లు రమేష్ చేసిన సేవలను కొనియాడారు.

కార్పొరేటర్ గా నా రెండేళ్ల ప్రస్థానంలో వెన్నంటి నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి

విశాలాంధ్ర-పెదగంట్యాడ: మీ అందరూ మా కుటుంబంపై అభిమానంతో నన్ను 75వ వార్డు కార్పొరేటర్ గా గెలిపించి నేటికి రెండు వసంతాలు పూర్తి అయింది. ఈ రెండేళ్ళ కాలములో మీ అందరి సహకారముతో, స్థానిక శాసన సభ్యులు శ్రీ తిప్పల నాగిరెడ్డి గారు మరియు మా నాయకుడు గాజువాక మాజీ శాసనసభ్యులు శ్రీ పల్లా శ్రీనివాస రావు గారి సహకారముతో ఉన్నంతలో నాకు అవకాశం ఉన్న ప్రతి పనిని త్రికరణ శు ద్ధిగా పూర్తి చేశాను అని అలాగే అవసరంలో నాకు ఎన్నో సమ్మి వచ్చిన ప్రతి వ్యక్తికి అండగా నా కుటుంబ సహకారముతో అండగా ఉన్నాను అని మీకు తెలియ చేయటానికి సంతోష పడుతున్నాను. వార్డు ప్రజల కనీస సౌకర్యాల సాధనకు జీవీఎంసీ కమిషనర్ జోన్ తహశీల్దార్ అన్ని ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాటర్ అన్ని డిపార్ట్మెంటులతో అనుసంధానం చేసుకుంటూ మచ్చ లేని విధంగా మీ అందరి ఆశీస్సులతో సహకారముతో చేయగలిగానందుకు మీ అందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. రానున్న కాలములో వార్డు లోని ముఖ్య సమస్యలు అన్ని పరిష్కరించి విశాఖ నగరపాలక సంస్థలో 75వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడంలో నా వంతు ప్రయత్నం చేసానని అన్నారు.

ప్రశాంతంగా గురుకులాల్లో ఐదు, మొదటి ఇంటర్ అడ్మిషన్ల ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-కశింకోట: విశాఖపట్నం,అనకాపల్లి జిల్లాల్లో ఉన్నటువంటి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు ఉమ్మడి జిల్లాల్లోని 11 కేంద్రాలలో ఆదివారం 5వ తరగతి ప్రవేశపరీక్ష ఉదయం 10నుండి మధ్యాహ్నం 12వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్ష మధ్యాహ్నం 2నుండి సాయంత్రం నాలుగున్నర వరకు సజావుగా జరిగాయని విశాఖ,అనకాపల్లి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయకర్త ఎస్. రూపవతి చెప్పారు.మండలంలోని తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో 5,ఇంటర్ ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని రూపవతి సందర్శించారు.ఈ సందర్భంగా రూపవతి మీడియా సమావేశంలో మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో గల పాఠశాలలకు 5వ తరగతికి మొత్తం 749 అభ్యర్థులు రాగా 553 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు.అనకాపల్లి జిల్లాలో 5వ తరగతి ప్రవేశానికి మొత్తం 2746 అభ్యర్థులు రాగా 2297 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. విశాఖపట్నం జిల్లాలో గల పాఠశాలల/కళాశాలలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నకు మొత్తం 452 అభ్యర్థులు రాగా 334 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.అనకాపల్లి జిల్లాలో పాఠశాల/ కళాశాలలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నకు మొత్తం 1517 అభ్యర్థులు రాగా 1166 మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కాని తల్లిదండ్రులకు కానీ ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసి ప్రశాంతంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు సిబ్బందికి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్, మండల విద్యాశాఖ అధికారి, పోలీస్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ప్రత్యేక అధికారుల సమయ పాలన పర్యవేక్షణలో జరిగిందన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలోని కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, సబ్బవరం, మేఘాద్రిగెడ్డ, శ్రీకృష్ణాపురం,మధురవాడ పరీక్షా కేంద్రాలను సందర్శించడం జరిగిందని,పరీక్ష జరిగే విధానాలను పరిశీలించి సమర్థవంతంగా పాటించడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

నాయుడుతోట, సుజాతనగర్ లో చలివేంద్రాలు

విశాలాంధ్ర-పెందుర్తి: సింహాచలం చందనోత్సవాన్నిపురస్కరించుకొని విశాఖ నగరంలో పలు ప్రజా సంఘాలు సేవాకార్యక్రమాలు నిర్వహించాయి. జీవీఎంసీ 94వ వార్డు, జోనల్ కార్యాలయం వద్ద నాయుడుతోట హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసీపీ నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరావు మాట్లాడుతూ సింహాచలేశుని సేవలో పాల్గొనడం పూర్వజన్మసుకృతంగా భావిస్తామన్నారు. ఈ చలివేంద్రం మూడు నెలలు కొనసాగిస్తామని చెప్పారు. అలాగే సుజాతనగర్ కూడలి వద్ద రాష్ట్ర కళింగ సేవాసంఘం సభ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ

పొట్లాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సంఘం నాయ కులు మాట్లాడుతూ గత పదేళ్లుగా చంద నోత్సవం మజ్జిగ పంపిణీ చేస్తు న్నామని చెప్పారు. కార్యక్రమం లో తమ్మినేని నర్సింగరావు, చింతాడ సురేష్, పేరాడ శ్యామలరావు, కర్రి క్రిష్ణమూర్తి, తిర్లింగి శ్రీరామరాజు, మామిడి వెంకటరమణ, కంచిపాటి జగదీష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ముత్యాలమ్మ ఉత్సవం విజయవంతం

ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్ కుమార్ బాలయ్య ప్రధాన కార్యదర్శి బేతాళుడు కోశాధికారి వినాయకరావు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యప్రాంత ఆరాధ్య దైవం, చింతపల్లి గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవం విజయవంతానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దురియా హేమంత్ కుమార్, పోతురాజు బాలయ్య లోహోపాటు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, కోశాధికారి పసుపులేటి వినాయక రావు లు ఆదివారం మాట్లాడుతూ ఈనెల 17 నుండి 20వ తేదీ వరకు నిర్వహించిన గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవం జయప్రదం చేయడంలో ముఖ్య భూమిక పోషించిన ఉత్సవ కమిటీ సభ్యులకు, పోలీసు, ఇతర శాఖల అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, యువనాయకులు భక్తులకు, ముఖ్యంగా ముత్యాలమ్మ ఆలయ ధర్మకర్తల వంశస్తులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి విజయవంతానికి సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులందరికీ ఈనెల 25న జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద నిర్వహిస్తున్న వియోగోత్సవ సభకు అన్నదాన భోజనంకు ఉత్సవ కమిటీ సభ్యులందరు విధిగా హాజరుకావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

2024లో ఎమ్మెల్యే అభ్యర్థిగా వంతల రామన్న దూసుకుపోతున్నాడు

విశాలాంధ్ర-పాడేరు: అల్లూరి సీతారామ రాజు జిల్లా పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయితీ లుంగాలంగి గ్రామం లో పర్యటించిన ఆదివాసుల ముద్దుబిడ్డ మమ్మెటికి రామన్న విజయానికి రాధా సారదులుగా కంకణం కట్టుకునే రామన్న కోసం ముందుకు కదులుతున్న జనం ప్రభంజనం ఏ గ్రామానికి వెళ్లిన రామన్నకు బ్రహ్మరథం పడుతున్నారు.2024 రామన్న గెలుపుకే రథసారధినంత తీవ్రంగా కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కూడా కళ్యాణం, కొర్ర లక్ష్మణరావు, కొర్ర ప్రసాద్, వార్డ్ మెంబర్, సిదేరి భీమేశ్వరావు, మర్రి అప్పారావు, మర్రి, రామారావు, లుంగాలంగి యూత్, సత్తిబాబు, కొర్ర బాలకృష్ణ, కొర్ర రాజేరావు, వంతల చిరంజీవి,పాంగి బాబురావు, కొర్ర నాగరాజు, వంతల పాడల్ అలాగే గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో గాలివాన బీభత్సం

నిలువ నీడను కోల్పోయిన వృద్ధురాలు

విశాలాంధ్ర-కొయ్యూరు :మండలంలో శు క్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు భారీ వర్షానికి ఓ వృద్ధురాలు ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి భారీ నష్టాన్ని మిగిల్చాయి. మండలంలోని మాడుమాల యు.చీడిపాలెం పంచాయితీ పలకజీడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు భారీ వర్షానికి గ్రామానికి చెందిన వంటరి మహిళ పల్లాల లక్ష్మమ్మ ఇంటి పై కప్పు రేకులన్ని ఎగిరిపోయి ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. గాలివాన బీభత్సానికి ఇల్లు ధ్వంసమై నిలువనీడను కోల్పోయి నిరాశ్రయురాలైన బాధితురాలు లక్ష్మమ్మను సర్పంచ్ దడాల రమేష్ ఉపసర్పంచ్ చిరంజీవులు పరామర్శించారు. భారీ వర్షం కారణంగా ఇంటిని కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన లక్ష్మమ్మ ను ఆదుకునే విధంగా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. గాలివాన బీభత్సానికి సర్వం కోల్పోయి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితురాలు లక్ష్మమ్మ వేడుకుంటోంది.